## క్లుప్తంగా

### కలెక్టర్‌కు సన్మానం



జనగామ/జనగామ రూరల్: నేషనల్ అచీవ్ మెంట్ సర్వేలో జిల్లా ప్రతిష్టలను జాతీయ స్థాయిలో కీర్తించబడేలా కృషి చేసిన కలెక్టర్ షేక్ రిజ్వాన్‌భాషాను జిల్లా ప్రధాన ఉపాధ్యాయుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు రేణిగుంట్ల మురళి, చంద్రయ్య ఉపాధ్యక్షురాలు జయలతతో కలిసి రాష్ట్ర కార్యదర్శి బుర్ర రమేష్ శుక్రవారం ఘనంగా సత్కరించి అభినందించారు. దేశంలోని 50 జిల్లాల్లో తెలుగు రాష్ట్రాల నుంచి కేవలం జనగామ నిలువడం గర్వకారణమన్నారు. అలాగే సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి, నాయకులు కలెక్టర్‌ను కలిసి శాలువాతో సత్కరించి అభినందించారు. అనంతరం పలు పట్టణంలో నెలకొన్న పలు సమస్యలను పరిష్కరించాలని వినతిపత్రం అందజేశారు.

### గోరింటాకు సంబురం



జనగామ: ఆషాఢ మాసం పురస్కరించుకుని జిల్లా కేంద్రంలో శుక్రవారం మహిళలు గోరింటాకు వేడుకలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ప్రకృతి పరంగా లభించే గోరింట ఆకులను నూరి చేతులకు అలంకరించుకున్నారు. గోరింటాకులో ఔషధ గుణాలు, చర్మ సంరక్షణ, వర్షా కాలంలో వచ్చే ఇన్ఫెక్షన్ల నుంచి రక్షణ కవచంగా పని చేస్తుంది. మహిళలు హైమా, జ్యోతి, అనిత, శ్వేత, రాధిక, సరితా, బాలమని, రాణి, లావణ్య, వందన పాల్గొన్నారు.

### మెకానిక్ మీట్



జనగామ: జిల్లా కేంద్రంలోని వైష్ణవి ఫంక్షన్ హాల్‌లో టారో టెక్స్‌మో పంప్స్ అధ్వర్యంలో శుక్రవారం కుసుమ హరినాథ్ బోర్ వెల్స్ సంస్థ మెగా మెకానిక్ మీట్ నిర్వహించింది. ఈ శిక్షణ కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి 160 మంది మెకానిక్‌లు హాజరయ్యారు. సంస్థ హైదరాబాద్ బ్రాంచ్ మేనేజర్ చంద్ర ప్రకాశ్, జనగామ ఏరియా సేల్స్ ఇన్‌చార్జ్ మల్లికార్జున స్వామి, సర్వీస్ ఇంజనీర్లు రాజేష్, కృష్ణ మాట్లాడుతూ మెకానిక్‌ల నుంచి అత్యుత్తమ స్పందన లభించిందన్నారు. ఉత్పత్తులపై అవగాహన కల్పించడంతో విశ్వాసం రెట్టింపు అయిందన్నారు. 48 గంటల సర్వీసు హామీ, రెండేళ్ల వారంటీ, 15 సంవత్సరాల స్పేర్‌పార్ట్స్ లభ్యత తదితర వాటికి సంబంధించి ప్రత్యక్షంగా చూపించినట్లు తెలిపారు.

### ఎన్నిక



రజిత

బచ్చన్నపేట: టీఎస్ జేయూ మహిళా విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షురాలుగా బచ్చన్నపేట మండల కేంద్రానికి చెందిన జర్నలిస్టు పోచంపల్లి రజిత ఎన్నికయ్యారు. శుక్రవారం ములుగు జిల్లా కేంద్రంలో జరిగిన రాష్ట్ర కమిటీ సమావేశంలో జిల్లా అధ్యక్షుడు ఉప్పలంచి నరేందర్ ప్రతిపాదన మేరకు రాష్ట్ర అధ్యక్షుడు నారగోని పురుషోత్తమ్, ప్రధాన కార్యదర్శి తోకల అనిల్‌కుమార్‌లు ఆమె ఎన్నికను ప్రకటించారు. అనంతరం నియామక పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా రజిత మాట్లాడుతూ తన ఎన్నికకు సహకరించిన వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

**రైతు సంఘం మండల నూతన కమిటీ..**

స్టేషన్‌ఘన్‌పూర్: తెలంగాణ రైతు సంఘం మండల నూతన కమిటీని ఘన్‌పూర్ డివిజన్‌కేంద్రంలో శుక్రవారం ఎన్నుకున్నారు. రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాపర్తి సోమయ్య, చందునాయక్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మండల నూతన అధ్యక్షుడిగా కత్తుల రాజు, ప్రధాన కార్యదర్శిగా లింగబోయిన కుమారస్వామి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా నెలమంచ వెంకట్ రెడ్డి, మంద మొగిళి, సహాయ కార్యదర్శులుగా మారబోయిన మల్లయ్య, అనుగుల ఎల్లయ్య, సభ్యులుగా యార మోహన్, వంగపండ్ల సోమయ్య, పిట్టల శ్రీను, రడపాక యాదగిరి ఎన్నికయ్యారు.

### మల్కాపూర్ మహిళలకు మహిళా శక్తి అవార్డులు

చిల్పూరు: మల్కాపూర్ గ్రామానికి చెందిన సరళాదేవి, రజిత, అక్షరలు శుక్రవారం స్టేషన్‌ఘన్‌పూర్‌లో నిర్వహించిన మహిళా శక్తి సంబురాల్లో కలెక్టర్ రిజ్వాన్‌బాషా, ఎమ్మెల్యే కడియం శ్రీహరి చేతుల మీదుగా ప్రత్యేక అవార్డులను అందుకున్నారు. అందులో జంగం సరళాదేవి రుణం తీసుకుని సమయ ప్రకారం చెల్లింపు, ఎలిశాల రజిత వరలక్ష్మి టెక్స్‌టైల్ ఏర్పాటుతో పాటు పలువురికి ఉపాధి కల్పించినందున, అన్నం అక్షర పలువురికి టైలర్ శిక్షణ ఇచ్చినందుకు గాను కలెక్టర్ చేతుల మీదుగా అవార్డులు తీసుకున్నారు.

# చిరు వర్షానికే రోడ్లు జలమయం

- పొంగి పొర్లిన డ్రెయినేజీ మురుగు నీరు
- హైదరాబాద్ రూట్‌లో ట్రాఫిక్ జామ్
- పంటలకు ఊపిరి పోసిన వరుణుడు



హైదరాబాద్ రోడ్డులో మురుగునీటి ప్రవాహం



హనుమకొండ రోడ్డు ఆర్టీసీ చౌరస్తా సమీపంలో..



వర్షంలోనే ప్రయాణం

జనగామ: జిల్లాలో శుక్రవారం సాయంత్రం నుంచి రాత్రి వరకు కురిసిన వర్షం వరి, పత్తి, మొక్కజొన్న తదితర పంటలకు కొంతమేర ఊపిరి పోయగా, పట్టణంలోని రోడ్లను ముంచేసింది. నెలరోజులుగా దోబూచులాడుతున్న వర్షం ఎట్టకేలకు కనికరించింది. జిల్లా కేంద్రంలోని హైదరాబాద్, హనుమకొండ రూట్ (చౌరస్తా సమీపంలో) రోడ్లన్నీ జలమయమయ్యాయి. దీంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు తప్ప లేదు. ద్విచక్రవాహనాల ఫుట్‌రెస్ట్ వరకు నీరు రాగా, సమీపంలోని దుకాణ షట్టర్ల వరకు చేరుకున్నాయి. దీంతో ట్రాఫిక్ కష్టాలు తప్పలేదు. డ్రెయినేజీల నుంచి వరద నీరు ముందుకు వెళ్లే పరిస్థితి లేక పోవడంతో.. మురికి నీరంతా రోడ్లపై ప్రవహించింది. రహదారులపై పెద్ద ఎత్తున వరద నీరు వచ్చినప్పటికీ, కమిషనర్ వెంకటేశ్వర్లు మాత్రం అడ్రస్ లేదు. మూడు రోజుల పాటు ఓ మోస్తారు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ ముందస్తు హెచ్చరికలను జారీ చేసినా, డ్రెనేజీలను క్లీన్ చేయించడంలో నిర్లక్ష్యం ప్రదర్శించారు. పట్టణంలో అసలు పురపాలిక పర్యవేక్షణ ఉందా లేదా అనే సందేహాలను పట్టణ ప్రజలు వ్యక్తం చేస్తున్నారు. ఉదయం నుంచి సాయంత్రం 6 గంటల వరకు 5.0 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదు కాగా, రాత్రి 7 గంటల వరకు 13.4 మి.మీ నమోదైనట్లు వాతావరణ శాఖ అధికారులు వెల్లడించారు. దేవరుప్పల మండలం(కోలుకొండ) లొకేషన్‌లో అత్యధికంగా 80.5 మి.మీ వర్షం కురియగా, జనగామలో 52.5, బచ్చన్నపేట మండలం పడమటి కేశ్వాపూర్ లొకేషన్‌లో 41.3, జనగామ మండలం వడ్లకొండ లొకేషన్‌లో 40.0, లింగాలఘనపురంలో 27.8మి.మీ, తదితర ప్రాంతాల్లో మోస్తారుగా కురిసింది.

# ఇందిరమ్మ ఇళ్లకు మొరం అనుమతి కరువు



బేస్‌మెంట్‌లో మొరం నింపకపోవడంతో నిలిచిపోయిన ఇంటి నిర్మాణం పనులు

తరిగొప్పుల: రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు మొరం అనుమతి దొరకపోవడంతో నత్తనడకన సాగుతున్నాయి. ఇళ్ల నిర్మాణం పునాది వరకు వచ్చిన సంబంధిత అధికారులు మొరం తరలించడానికి అనుమతులు నిరాకరించడంతో ముందుకు సాగడంలేదు. ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ మొరం అనుమతి కోసం వెళ్తున్నా అధికారులు అనుమతులు ఇవ్వడంలేదని లబ్ధిదారులు వాపోతున్నారు. మొరం దందా చేసే వారిని సంప్రదిస్తే ట్రాక్టర్ ట్రిప్ డబ్బులు కాకుండా అధికారుల నుంచి అనుమతులు తీసుకోవడానికి అధనంగా రూ.5,000 అడుగుతున్నారని వాపోతున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మొరం పోసుకునేందుకు అనుమతులు ఇవ్వాలని పలువురు కోరుతున్నారు.

# సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

నర్మెట: సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మండల వైద్యాధికారిణి సుకన్య అన్నారు. మండలకేంద్రంలో శుక్రవారం సిబ్బంది నిర్వహించిన ఇంటింటి పరిశీలన క్యాంపులో పాల్గొన్న ఆమె పలు సూచనలు చేశారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతను పాటించాలని, ప్రతీ మంగళ, శుక్రవారాల్లో డ్రై డేను న్విహించి మురుగు నీరు నిల్వకుండా చూడడంతోపాటు మురుగు నీటి ప్రాంతాల్లో ఏఎల్‌ఓ ద్రావణాన్ని పిచికారీ చేయించాలని సూచించారు. ఈ సందర్భంగా ఇళ్లలో సిబ్బంది పైరిథ్రమ్‌ను పిచికారీ చేశారు. కార్యక్రమంలో ఎస్‌యూఓ తిరుపతిరెడ్డి, హెచ్ఎస్ శ్రీను, హెచ్‌ఏ వేణు, ఏఎన్‌ఎంలు కుల్సుం సుల్తానా, గాదెర కరుణ, కార్యదర్శి కందకట్ల శ్రీధర్, బిల్ కలెక్టర్ చిర్ర వెంకట్ రెడ్డి, ఆశాలు స్వేత, చంద్రకళ, శ్యామల, మంగ పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలలకు పూర్వవైభవం తేవాలి



నోట్‌బుక్స్, టై, బెల్టులు అందుకున్న విద్యార్థులు

దేవరుప్పుల: శక్తి సామర్థ్యాలతో ఉచిత విద్యాబోధన చేసే ప్రభుత్వ పాఠశాలలకు ప్రజల భాగస్వామ్యంతో పూర్వవైభవం తేవాలని లయన్స్ క్లబ్ ఆఫ్ జనగామ, లింగాలఘనపురం ప్రతినిధులు శివరామకృష్ణ, వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. శుక్రవారం సీర్నాల హరిజనకాలనీ ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీలో క్లబ్‌ల ఆధ్వర్యంలో రూ.3 వేల వ్యయంతో విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. అలాగే స్థానిక హెచ్‌ఎం శివగారి కిరణ్‌కుమార్, రంగు రజనీ దంపతుల కుమార్తె శ్రేష్ఠ ప్రవస్తి జన్మదినం పురస్కరించుకొని విద్యార్థులకు టై, బెల్ట్‌లు, ఐడీ కార్డులను అందజేశారు. చంద్రకళ, నల్ల నిర్మల, లక్ష్మి, శ్రీను, నర్సింహులు ఉన్నారు.

## ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు దూరంగా ఉండాలి



మాట్లాడుతున్న సీఐ వేణు

స్టేషన్‌ఘన్‌పూర్: విద్యార్థులు, యువత ఆన్‌లైన్ బెట్టింగ్ గేమ్‌లకు దూరంగా ఉండాలని, సైబర్‌మోసాలకు గురికావొద్దని స్టేషన్‌ఘన్‌పూర్ సీఐ జి.వేణు అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సీపీ ఆదేశాల మేరకు జాగృతి పోలీసు కళాబృందం ఆధ్వర్యంలో శుక్రవారం కళాజాతా చేపట్టారు. ఈ సందర్భంగా గంజాయి, డ్రగ్స్, ఆన్‌లైన్‌బెట్టింగ్ మోసాలు, రోడ్డు ప్రమాదాలు, డయల్ 100, ఈవ్ టీజింగ్, షీటీమ్స్ తదితర అంశాలపై పోలీసు కళాబృందం ఆధ్వర్యంలో కళాజాతతో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఎస్సై వినయ్‌కుమార్, ప్రిన్సిపాల్ రాజిరెడ్డి, ఎన్‌ఎస్ఎస్ కోఆర్డినేటర్లు కమలాకర్, లావణ్య, కళాబృందం ఇంఛార్జీ, ఉమెన్ ఏఎస్‌ఐ నాగమణి, సభ్యులు విలియమ్, వెంకటేశ్వర్లు, పూల్‌సింగ్, శ్రీనివాస్, నారాయణ, విక్రమ్ రాజ్, చిరంజీవి పాల్గొన్నారు.

# నిధులు మంజూరు చేయాలి



మాట్లాడుతున్న కిషన్‌రెడ్డి

స్టేషన్‌ఘన్‌పూర్: స్టేషన్‌ఘన్‌పూర్ శివారులోని బైరవ గుట్ట(తలకాయల గుట్ట)పై ఉన్న కాకతీయుల కాలం నాటి శ్రీవైద్యనాథ స్వామి దేవాలయ నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం, భగవత్ భక్తులు సహకరించాలని ఆలయ నిర్వాహకుడు, శివ భక్తుడు భూనేటి కిషన్‌రెడ్డి కోరారు. ఈ మేరకు శుక్రవారం పలువురు శివ భక్తులతో కలిసి బైరవగుట్ట వద్ద ఆయన మాట్లాడారు. ముందుగా శ్రీవైద్యనాథస్వామికి ప్రత్యేక పూజలు చేపట్టారు. అనంతరం మాట్లాడుతూ గతంలో తెలంగాణ ఉద్యమ సమయంలో, కరోనా సమయంలో, 2023లో భారీ వరదల సమయంలో ప్రజలను కాపాడాలని స్వామివారిని ప్రార్థించినట్లు తెలిపారు. ప్రస్తుతం వర్షాభావ పరిస్థితులు నెలకొనగా సమృద్ధిగా వర్షాలు కురిసి పంటలు బాగా పండాలని పూజలు చేపట్టినట్లు చెప్పారు. భక్తులు గోనెల శ్రీనివాస్, భూక్య హరిలాల్, చిర్ర వెంకటేశ్వర్లు, రమేష్, శివకృష్ణ, పాండు, రేవంత్, హనుమదాసానంద పాల్గొన్నారు.

## సద్వినియోగం చేసుకోండి



పత్రాలను అందజేస్తున్న అరవింద్ చౌదరి

నర్మెట: దీన్ దయాల్ ఉపాధ్యాయ గ్రామీణ కౌశల్య యోజన పథకాన్ని గ్రామీణ నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ బోడపాటి అరవింద్ చౌదరి అన్నారు. స్థానిక డీఆర్డీఏ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన మేళాకు హాజరైన 18 మంది యువతీ యువకులకు శిక్షణ–ఉపాధిలో భాగంగా వరంగల్ శ్రీ టెక్నాలజీస్ ద్వారా కంప్యూటర్, స్పోకెన్ ఇంగ్లిష్, కమ్యూనికేషన్ స్కిల్స్, పర్సనాలిటీ డెవలప్‌మెంట్‌లలో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఆయన తెలిపారు. శిక్షణా కాలంలో ఉచిత భోజనం, వసతి, యూనిఫాంతోపాటు రూ. 3 వేలు భృతి అందజేయడం జరుగుతుందని అనారు. మేళాకు హాజరుకాని నిరుద్యోగ యువత తమ విద్యార్హత పత్రాలతో వరంగల్ శిక్షణా కేంద్రానికి వెళ్లాలని తెలిపారు. శిక్షణ అనంతరం నేషనల్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా, రాష్ట్ర ప్రభుత్వం అందించే ఈజీఎంఎం సర్టిఫికేట్‌తో ప్రముఖ కార్పోరేట్ సంస్థలలో ఉద్యోగం పొందవచ్చన్నారు. పూర్తి వివరాలకు శిక్షణ కేంద్రం ఇన్‌చార్జ్ రాజేందర్ సెల్ 98491 31050, 96662 09963 లో సంప్రదించాలని తెలిపారు. ఏపీఎం రవి, ఏపీఓ రమాదేవి, యువతీ యువకులు పాల్గొన్నారు.

# స్నేహితురాలి కుటుంబానికి అండ



రశీదు చూపిస్తున్న పూర్వవిద్యార్థులు

జనగామ: స్నేహితురాలి కుమార్తెకు అండగా నిలబడ్డారు తనతో కలిసి చదివిన పూర్వవిద్యార్థులు. జిల్లా కేంద్రానికి చెందిన శోభ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందింది. కాగా, శోభతో కలిసి 2003–04 బ్యాచ్ పదోవ తరగతి చదువుకున్న పూర్వవిద్యార్థులు రూ.50 వేలు పోగుచేసి ఆమె కుమార్తె ప్రశాంతి రేఖ పేరుపై తపాలా శాఖలో సుకన్య సమృద్ధి యోజన పథకంలో శుక్రవారం జమ చేశారు. అట్టి రసీదును బాధిత కుటుంబసభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో రాజ్‌కుమార్, నేతి శ్రీమాన్, దండిగ రాజు, బానోతు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఆలయ నిర్మాణానికి విరాళం



విరాళం అందజేస్తున్న వంశీధర్‌రెడ్డి

లింగాలఘణపురం: మండలంలోని నెల్లుట్లలో కురుమ సామాజిక వర్గానికి చెందిన వారు నిర్మిస్తున్న బీరప్ప కామరాతి గుడి నిర్మాణానికి మాజీ జెడ్పీటీసీ గుడి వంశీధర్‌రెడ్డి రూ.51,116 విరాళం అందజేశారు. శుక్రవారం గుడి నిర్మాణ కమిటీ, పీఏసీఎస్ డైరెక్టర్ బాలరాజు ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి విన్నవించగా సానుకూలంగా స్పందించి విరాళం అందజేయడమే కాకుండా ప్రభుత్వ పరంగా ఏమైనా సహాయసహకారాలు అందజేస్తానని తెలిపారు. పెద్ద కురుమ కడకంచి అంజనేయులు, గొరిగె మల్లయ్య, వీరస్వామి, మల్లేశం, మల్లయ్య, బాలయ్య, శ్రీనివాసు, రాణాప్రతాప్ తదితరులు ఉన్నారు.

# దేవాదుల ద్వారా సాగునీరందించాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

జనగామ రూరల్: దేవాదుల ప్రాజెక్టు ద్వారా గోదావరి జలాలను లిఫ్టింగ్ చేసి జనగామ ప్రాంతానికి సాగునీరందించాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి భూక్యా చందు నాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు రైతు సంఘం ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట సంఘం నాయకులు రైతులతో కలిసి శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద పెట్టున నినాదాలు చేశారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ హుస్సేన్‌నాయక్‌కు అందజేశారు. ఉర్సుల కుమార్, పయ్యావుల భిక్షపతి, గురజాల లక్ష్మీనరసింహారెడ్డి, తాండ్ర ఆనందం, నర్సిరెడ్డి, కర్ర బీరయ్య, రామచంద్రు ఐలయ్య, రైతులు పాల్గొన్నారు.

### ఎల్‌ఓసీ అందజేత

చిల్పూరు: చిన్నపెండ్యాల గ్రామానికి చెందిన గడ్డమీది యాదగిరి ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడగా కాలు పూర్తిగా తొలిగించారు. ఆర్థిక స్తోమత లేక ఇబ్బంది పడుతుండగా గ్రామ నాయకులు తాళ్లపల్లి సమ్మయ్య, రాజ్‌కుమార్, సంపత్, గడ్డమీది అశోక్‌లు ఎమ్మెల్యే కడియం శ్రీహరి దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే రూ. 4.55 లక్షల ఎల్ఓసీని శుక్రవారం బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు.

**కంటి వైద్యశిబిరం**

జనగామ రూరల్: ఎర్త్ ఫౌండేషన్ సంస్థ ఓబుల్‌కేశవాపూర్ గ్రామంలోని ప్రాథమిక పాఠశాలను దత్తత తీసుకోవడంతోపాటు ఉన్నత పాఠశాల విద్యార్థులకు శుక్రవారం కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించింది. శిబిరంలో విద్యార్థులకు వైద్యులు కంటి పరీక్షలు నిర్వహించి కళ్లద్దాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏఎంఓ శ్రీనివాస్ మాట్లాడుతూ ఎర్త్ ఫౌండేషన్ ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి కృషి చేస్తుందని అన్నారు. ఎంఈఓ శంకర్‌రెడ్డి, ఉన్నత, ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎంలు నరసింహారెడ్డి, సురేందర్‌రెడ్డి, సోషల్ వాయిస్ ఫౌండేషన్ డైరెక్టర్ మంగళంపల్లి రాజు, ఎర్త్ ఫౌండేషన్ డైరెక్టర్ వెన్నెల, కోఆర్డినేటర్లు రాజు, ఆంజనేయులు, మోటివేషన్ స్పీకర్ నరేష్ తదితరులు పాల్గొన్నారు.

**ఆర్టీసీ బస్సులో గుండెపోటుతో వృద్ధుడి మృతి**



కొమురయ్య(ఫైల్)

స్టేషన్‌ఘన్‌పూర్: మండలంలోని ఇప్పగూడెం గ్రామానికి చెందిన అన్నెపు కొమురయ్య (65) అనే వ్యక్తి ఆర్టీసీ బస్సులో గుండెపోటుకు గురై మృతిచెందిన విషాదకర సంఘటన శుక్రవారం రాత్రి జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. ఇప్పగూడెంకు చెందిన కొమురయ్య వ్యక్తిగత కారణాలతో హనుమకొండలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి వెళ్లి తిరిగి వస్తూ మడికొండలోని తన మనువరాలు (బిడ్డ కుమార్తె)ను చూసి తిరిగి ఆర్టీసీ బస్సులో స్టేషన్‌ఘన్‌పూర్‌కు బయలుదేరాడు. ఈ క్రమంలో ఆర్టీసీ బస్సు రాంపూర్ సమీపంలోకి రాగానే ఒక్కసారిగా ఛాతిలో తీవ్ర నొప్పిరావడంతో గుండెపోటుకు గురై బస్సులోనే కుప్పకూలి మృతిచెందాడు. మృతుడికి భార్య, ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు.

**మతిస్థిమితం లేని వ్యక్తి హత్య**

బచ్చన్నపేట: మతిస్థిమితం లేని వ్యక్తి హత్యకు గురైన సంఘటన మండల కేంద్రంలో శుక్రవారం తెల్లవారు జామున జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. యాదాద్రిభువనగిరి జిల్లా ఆలేరు మండలం శారాజీపేటకు చెందిన బత్తుల రాజిరెడ్డి(50) 25 సంవత్సరాలుగా ఇక్కడే హోటల్‌లలో పని చేసుకుంటూ జీవిస్తున్నాడు. ఇటీవల పూర్తిగా మతిస్థిమితం కోల్పోయి రోడ్ల వెంబడి తిరుగుతున్నాడు. చౌరస్తాలో రోడ్డు పక్కనే ఉన్న నిర్మాణ దశలో ఉన్న ఓ బిల్డింగ్‌లో ప్రతి రోజు రాత్రి పడుకుంటాడు. కాగా, శుక్రవారం తెల్లవారు జామున గుర్తు తెలియని వ్యక్తులు రాజిరెడ్డి నిద్రిస్తున్న సమయంలో తలపై బండరాయితో బాది హత్య చేశారు. మృతుడికి అన్న జోగిరెడ్డి, ఆలింపూర్‌లో సోదరి వరలక్ష్మి ఉన్నారు. సోదరి ఫిర్యాదు మేరకు ఘటనా స్థలానికి నర్మెట సీఐ అబ్బయ్య, ఎస్సై ఎస్‌కే అబ్దుల్ హమీద్ డాగ్ స్క్వాడ్‌తో చేరుకుని కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. పోలీసులు సీసీ ఫుటేజీలను పరిశీలించి నిందితులను గుర్తించే పనిలో నిమగ్నమయ్యారు.

## సంక్షిప్త సమాచారం

**విద్యార్థి ఆత్మహత్య**



అక్షయ్ (ఫైల్)

బచ్చన్నపేట: మండలంలోని ఆలింపూర్ గ్రామానికి చెందిన చింతల అక్షయ్ (20) హనుమకొండలో ఆత్మహత్య చేసుకున్న సంఘటన శుక్రవారం జరిగింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆలింపూర్ గ్రామానికి చెందిన చింతల స్వరూప–నర్సయ్య దంపతులకు కుమారుడు, కుతురు ఉన్నారు. నర్సయ్య బోర్‌వెల్ వాహనంపై పని చేస్తుండగా కుమారుడు అక్షయ్ మంచిర్యాలలో మైనింగ్ డిప్లొమా మూడో సంవత్సరం చదువుతున్నాడు. అక్కడే రెవెన్యూ కాలనీలో అద్దె ఇంట్లో నివాసం ఉండేవాడు. కాగా, ఇటీవల తల్లిదండ్రులు నివాసం ఉంటున్న హనుమకొండలోని జులైవాడకు వచ్చాడు. తల్లిదండ్రులు లేని సమయంలో ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడని తెలిపారు. అక్షయ్ మృతితో అలింపూర్‌లో విషాదఛాయలు అలుముకున్నాయి.

**భర్తపై భార్య ఫిర్యాదు**

నర్మెట: భార్య ఫిర్యాదుతో భర్తపై పోలీసులు కేసు నమోదు చేసిన సంఘటన మండల కేంద్రంలో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. మండలకేంద్రానికి చెందిన మేకల రమేశ్ 2007లో లక్ష్మిని వివాహం చేసుకోగా ముగ్గురు సంతానం. ఆర్‌ఎంపీగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్న క్రమంలో హైదరాబాద్‌కు చెందిన మంజులను రెండో వివాహం చేసుకుని మెడికల్ షాపు పెట్టించి, ఆమె పేరున కొంత భూమిని రిజిస్ట్రేషన్ చేయడంతో పాటు ఆమె వద్దనే ఉంటున్నాడు. ఆమెకు ముగ్గురు సంతానం. ఈక్రమంలో శుక్రవారం ఉదయం మొదటి భార్య ఇంటికి వెళ్లి ఆమె పేరుమీద ఉన్న భూమిని తన పేరుమీద చేయాలని లేదంటే చంపేస్తానని బెదిరిస్తూ గొడవ చేశాడు. దీంతో లక్ష్మి ఫిర్యాదుతో కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు ఎస్సై నైనాల నగేష్ తెలిపారు.

**కేంద్ర సహాయ మంత్రిని కలిసిన నాయకులు**

లింగాలఘణపురం: బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌ను శుక్రవారం జనగామలోని బీజేపీ కార్యాలయంలో మండలానికి చెందిన ఓబీసీ మోర్చా నాయకుడు చౌదరిపల్లి సతీష్ మర్యాదపూర్వకంగా కలిసి మెమొంటో ఇచ్చి శాలువాతో సన్మానించారు. ఆయనతో పాటు బీజేపీ మండల అధ్యక్షుడు సంపత్, ప్రధాన కార్యదర్శి గణేష్, మోర్చా అధ్యక్షుడు మల్లేష్, నాయకులు ఉన్నారు.

**స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలి**

బచ్చన్నపేట: స్థానిక సంస్థల ఎన్నికల్లో అధిక స్థానాలు సాధించి బీఆర్ఎస్ పార్టీ సత్తా చాటాలని మండల ఇన్‌చార్జ్‌లు గద్దల నర్సింగారావు, పెద్ది రాజిరెడ్డి అన్నారు. శుక్రవారం పోచన్నపేట, నారాయణపురం గ్రామాలలో నిర్వహించిన సన్నాహక సమావేశంలో వారు మాట్లాడారు. అధికార పార్టీ నాయకులు ఎన్ని ఎత్తులు వేసినా బీఆర్ఎస్ గెలుపును ఆపలేరని అన్నారు. నాయకులు ఇర్రి రమణారెడ్డి, చెంద్రారెడ్డి పలువురు పాల్గొన్నారు.

**గులాబీ జెండా ఎగురవేయాలి**

నర్మెట: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో గ్రామగ్రామాన గులాబీ జెండా ఎగురవేయాలని క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు బాల్నె సిద్దిలింగం, గంగం సతీష్ రెడ్డి, ఉడుగుల నర్సింహులు, ధర్మపురి శ్రీనివాస్, మహమ్మద్ యాకూబ్ పాషా అన్నారు. పార్టీ మండల శాఖ అధ్యక్షుడు చింతకింది సురేష్ అధ్యక్షతన ఇప్పలగడ్డ, ఆగాపేట, మాన్సింగ్‌తండాలలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడారు.

**ఆర్థికసాయం**

బచ్చన్నపేట: కొన్నె గ్రామానికి చెందిన చెవుల ప్రవీణ్ అనారోగ్యంతో బాధపడుతున్నాడు. కాగా, శుక్రవారం సామాజిక సేవా కర్త కోడూరి శివకుమార్‌గౌడ్ ప్రవీణ్‌ను పరామర్శించి ఆస్పత్రి ఖర్చుల కోసం రూ.5వేల సాయం అందజేశారు. వెంకట్ రెడ్డి, శ్రీనివాస్, కనుకరాజు ఉన్నారు.

**సొంతింటి కల నెరవేరుతోంది**

బచ్చన్నపేట: కాంగ్రెస్ హయాంలోనే నిరుపేదల సొంతింటి కల నెరవేరుతోందని ఆ పార్టీ సీనియర్ నాయకుడు జంగిటి విద్యానాథ్ అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ గత పదేళ్ల బీఆర్ఎస్ హయాంలో నిరుపేదలు ఇక్కరికి ఇల్లు రాలేదన్నారు. బీఆర్ఎస్ నేతలు సీఎం చేస్తున్న అభివృద్ధి పనులను చూసి ఓర్వలేక నిరాధారమైన ఆరోపణలు చేస్తున్నారన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను చిత్తుగా ఓడించి అన్ని స్థానాలను కైవసం చేసుకోవాలని పిలుపునిచ్చారు.

# దివ్యాంగులకు రూ.6 వేల పింఛన్ పెంచాలి

**వీహెచ్‌పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుమార్**



మాట్లాడుతున్న కుమార్

రఘునాథపల్లి: కాంగ్రెస్ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు దివ్యాంగులకు రూ 6 వేలు, వృద్ధులు, వితంతువుల చేయూత పింఛన్లు రూ.4 వేలకు పెంచాలని వీహెచ్‌పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఓ వేడుకల మందిరంలో వీహెచ్‌పీఎస్–ఎంఎస్పీ సంయుక్తంగా నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దివ్యాంగులు, చేయూత పింఛన్ దారులకు పింఛన్లు పెంచకుండా, కొత్త పింఛన్లు ఇవ్వకుండా కాంగ్రెస్ ప్రభుత్వం తీరని అన్యాయం చేస్తుందన్నారు. ఈ నెల 29న జనగామలో దివ్యాంగులు, చేయూత పింఛన్ దారులతో నిర్వహించే జిల్లా మహాసభకు ముఖ్య అతిథిగా మంద కృష్ణమాదిగ హాజరు కానున్నట్లు తెలిపారు. వీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు గద్దం సోమరాజ్, ప్రధాన కార్యదర్శి గద్దం సందీప్, ఎంఎస్పీ మండల అధ్యక్షుడు సుంచు సురేందర్, లింగాల రవి, కొన్నె లక్ష్మి, భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

# సమరానికి సిద్ధంగా ఉండాలి

**డీసీసీ ఉపాధ్యక్షుడు నర్సింహారెడ్డి**



సమావేశంలో పాల్గొన్న నాయకులు

నర్మెట: స్థానిక సంస్థల సమరానికి కాంగ్రెస్ సైనికులు సిద్ధంగా ఉండాలని డీసీసీ ఉపాధ్యక్షుడు గంగం నర్సింహారెడ్డి అన్నారు. డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి సూచనలతో శుక్రవారం కన్నెబోయిన గూడెం, వెల్దండ, అమ్మాపురంలలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ఇంటింటికి వివరించి సమన్వయంతో గ్రామగ్రామాన కాంగ్రెస్ జెండాను ఎగరవేయాలని అన్నారు. ఈ సమావేశంలో మండల శాఖ అధ్యక్షుడు రాజబోయిన లక్ష్మినారాయణ, గ్రామ శాఖల అధ్యక్షులు, అనుబంధ సంఘాల తదితరులు పాల్గొన్నారు.

**పార్టీ కోసం పనిచేయాలి**

తరిగొప్పుల: వ్యక్తిగత ప్రయోజనాల కోసం కాకుండా పార్టీ కోసం, అదిష్టానం సూచించిన అభ్యర్థి గెలుపుకోసం కృషిచేయాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వగలబోయిన యాదగిరి, బైకాని బాల్‌రాజ్ యాదవ్ అన్నారు. మండలంలోని అంకుషాపూర్ గ్రామంలో గ్రామశాఖ అధ్యక్షుడు చిన్నముత్తి యాదగిరి అధ్యక్షతన శుక్రవారం స్థానిక సంస్థల ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. అర్జుల పోషిరెడ్డి, బైకని బాలరాజ్ యాదవ్,మాదాసు బిక్షపతి, ఎర్రోజు బిక్షపతి, కత్తుల సాయిరెడ్డి, కత్తుల కొంరయ్య, బ్యాంగి శివకుమార్,థామస్, మహేందర్ రెడ్డి, కల్వ రాజు పాల్గొన్నారు.

# 'రైతులను మోసం చేసేందుకే పాదయాత్ర'

పాలకుర్తి టౌన్: రైతులను మోసం చేసేందుకే మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు కాల్వల సందర్శన పేరుతో పాదయాత్ర చేస్తున్నారని పాలకుర్తి దేవస్థానం డైరెక్టర్, కాంగ్రెస్ మండల నాయుడు లోనె శ్రీనివాస్, మాజీ సర్పంచ్ పసులాది వెంకటేష్ అన్నారు. శుక్రవారం శాతాపురం క్రాస్‌రోడ్డు వద్ద విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కసరబోయిన కృష్ణమూర్తి, మారుజోడు సంతోష్, ఏలూరి యాకన్న, తోడేటి చిన్న యాదయ్య, బొందుగుల కొండయ్య పాల్గొన్నారు.